క్లుప్తంగా

కాలనీల అభివృద్ధికి కృషి



ఇందిరమ్మ కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మండల పరిధిలో ఆర్ఎస్ రంగాపురంలో గ్రామస్తుల విన్నపం మేరకు ఇందిరమ్మ కాలనీని ఆయన సందర్శించారు. తాగునీటి సమస్య, విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని విన్నవించగా సమకూర్చుతామని ఎంపీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుమ్మ గాల్ల రాజు, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి, వైస్ ఎంపీటీసీ రంగస్వామి, గ్రామ నాయకులు తిమోతి పాల్గొన్నారు.

వడ్డెర సొసైటీలకు మైనింగ్ గనులు కేటాయించాలి



మాట్లాడుతున్న శిల్పి సుబ్బరాయుడు

బేతంచెర్ల: ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్న వడ్డెర్లను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డెర సొసైటీలకు మైనింగ్ గనులను కేటాయించాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు కోరారు. ఆదివారం పట్టణంలోని వడ్డెపేటలో ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర సొసైటీలకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మైనింగ్‌లో 50 శాతం రిజర్వేషన్ కల్పించి, కంట్రాక్ట్‌లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, వరదరాజు, మధు, చల్లా శివ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్

డోన్ టౌన్ : ఆన్‌లైన్ బెట్టింగ్, లివింగ్, ఫ్రెండ్‌షిప్, రమ్మీ, లోన్ యాప్స్‌ని నిషేధిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు అధికారులను కోరారు. స్థానిక నక్కిరామన్న భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్న సందర్భంలో ఆన్‌లైన్ యాప్స్ భారిన పడిన పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతూ ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు సైబర్ నేరగాళ్లపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు రణత్‌యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్, నాయకులు రంగస్వామి, మనోజ్ దివాకర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

18న జగనన్న సురక్ష

బనగానపల్లె : మండలంలోని ఇల్లూరుకొత్తపేట, రామతీర్థం గ్రామాలతో పాటు బనగానపల్లె సచివాలయం-4 పరిధిలో ఈ నెల 18న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లెరూరల్: వీఆర్ఏల సమస్యలు పరిష్కారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు నాగేష్ కోరారు. ఆదివారం స్థానిక పాండురంగస్వామి ఆలయ ఆవరణలో మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తలారి బాలుడు ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ వీఆర్ఏలకు వేతనాలు పెంచాలన్నారు. ఈ మేరకు 21,22వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలో వీఆర్ఏలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తలారి సుబ్రహ్మణ్యం, రవి, గౌస్, మద్దిలేటి, బాలకృష్ణ, సీఐటీయూసీ నాయకుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్యాపిలి: ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణాత్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్ కోరారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల కన్వీనర్‌గా శివకేశవులు, కో కన్వీనర్‌గా శివప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రంగస్వామి, మనోజ్, శివకిశోర్, వంశీ, చంద్రనాయక్, లక్ష్మీనారాయణ, బంగారప్ప తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు ఆశాజనకం!

- వరుణుడి కరుణ కోసం రైతన్న ఎదురు చూపులు
- సర్వం సిద్ధం చేసుకున్న రైతులు
- బోరు బావుల కింద మొక్కజొన్న, హైబ్రిడ్ పత్తి సాగు



ట్రాక్టర్‌తో విత్తనం వేస్తున్న రైతన్నలు (ఫైల్)

బనగానపల్లె: ఖరీఫ్ సీజన్ మొదలై నెలన్నర గడుస్తున్నా సరైన వర్షాలు కురువకపోవడంతో రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అయితే అడపాదడపా కురుసిన వర్షాలతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. చాలా మంది రైతులు సాగుకు సర్వం సిద్ధం చేసుకుని వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో 2022-23 సంవత్సరానికిగాను మొదటి విడతగా 42వేల మంది రైతులకు రూ.23.12 కోట్ల రైతు భరోసా నగదును ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేసింది. దీంతో పెట్టుబడి సమస్య తీరింది. అదేవిధంగా ఆర్‌బీకేలలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచారు అధికారులు. డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులతోపాటు పిచికారీ మందులు ఆర్బీకేలలో సిద్ధంగా ఉన్నాయి. నియోజకవర్గంలో వ్యవసాయ బోరుబావుల ఆధారంగా ఖరీఫ్‌లో వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం సుమారు 12వేల హెక్టార్లలో మొక్కజొన్న, 4వేల హెక్టార్లలో హైబ్రిడ్ పత్తి పంటను రైతులు ఇప్పటికే సాగు చేశారు. ఈ నెల చివరికి మొక్కజొన్న సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

రైతుభరోసా మొత్తం మండలాలవారీగా

మండలం	అర్హుల సంఖ్య	మంజూరైన నగదు కోట్లలో
బనగానపల్లె	12,177	6.70
కోవెలకుంట్ల	6,152	3.39
అవుకు	8,995	4.96
సంజామల	6,230	3.42
కొలిమిగుండ్ల	8,451	4.65

మొక్కజొన్న సాగుకే మొగ్గు...

గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో మొక్కజొన్న సిరులు కురిపించింది. మంచి దిగుబడులతోపాటు గిట్టుబాటు ధర రావడంతో రైతులు లాభపడ్డారు. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. గిట్టుబాటు ధర రూ. 1,800 నుంచి 2,000 వరకు లభించింది. దీంతో రైతులు మొక్కజొన్న సాగుకే మొగ్గ చూపుతున్నారు. ప్రభుత్వం జమ చేసిన పెట్టుబడి సాయంతో సర్వం సిద్ధం చేసుకుని వర్షం రాక కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం



ప్రభుత్వంరైతులను అన్నివిధాలుగా ఆదుకుంటుంది. ప్రత్యేకించి పెట్టుబడి సాయం రైతులకు ఊరటనిస్తుంది. అదేవిధంగా ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, మందులు అందజేస్తున్నందున రైతులు చాలా ఇబ్బందులు తప్పాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందడంతో సాగు పనులు పూర్తి చేశాం. వర్షం కురిస్తే సాగు బాగా ఉంటుంది. – శ్రీనివాసరెడ్డి, రైతు వెంకటాపురం, బనగానపల్లె మండలం

పెట్టుబడి సాయం ఆదుకుంటుంది



ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి సాయం రైతులను ఆదుకుంటుంది. ఖరీఫ్‌లో పంటల సాగుకు అప్పులు చేయాల్సిన అవసరంలేదు. ఖరీఫ్ సీజన్ కంటే ముందుగా నిధులు మంజూరు చేయడం హర్షనీయం. ఆర్‌బీకేల్లో అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వరుణుడు కరుణిస్తే ఖరీఫ్ సాగు బాగుంటుంది. – వెంకటేశ్వర్లు, రైతు సాదుకొట్టం, బనగానపల్లె మండలం

ఆర్బీకేలలో విత్తనాలు, ఎరువులు



ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన మేర అన్ని సేవలు లభిస్తున్నాయి. బయట అధిక ధరలు వెచ్చించి, విత్తనాలు కొనుగోలు చేయకుండా ఆర్‌బీకేల ద్వారానే విత్తనాలు సరఫరా చేస్తున్నాం. సాగుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లెకుండా ఇప్పటికే యూరియా డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. – సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి బనగానపల్లె మండలం

అండగా నిలిచిన వలంటీర్



వెంకటమ్మకు కూరగాయలు అందజేస్తున్న వలంటీర్ ఇల్లూరు దీపక (ఫైల్)

ఈ చిత్రంలో పెన్షన్ అందజేస్తున్న యువతి పేరు ఇల్లూరు దీపిక. బేతచెర్ల మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామ వలంటీర్‌గా సేవలు అందిస్తున్నారు. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసినా సేవా భావంతో వలంటీర్‌గా ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రత్యేకించి కరోనా కష్టకాలంలో వలంటీర్ దీపిక చేసిన సేవలను నేటికీ గుర్తు చేస్తున్నారు ఆయా కాలనీల ప్రజలు. ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో ప్రతి గడప తలుపు తట్టి నిత్యావసర సరుకులు, మాస్కులు, ప్రభుత్వ సాయాన్ని అందజేసి అండగా నిలిచిన సందర్భాలను కొనియాడుతున్నారు. అదే విధంగా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీస్తూ అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేసిన సంఘటనలు గుర్తు చేసుకుంటున్నారు కాలనీ ప్రజలు. – బేతంచెర్ల

కుటుంబ సభ్యురాలిలాగా సేవలు



వలంటీర్‌ల సేవలు చాలా బాగున్నాయి. ప్రత్యేకించి కరోనా సమయంలో కుటుంబ సభ్యుల్లా మెలిగారు. నా విషయంలో వలంటీర్ ఇల్లూరు దీపిక చేసిన సేవలు ఎప్పటికీ మరువను. కూలీ పనులకు వెళ్తూ ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్న తనకు కరోనా కాలంలో దిక్కుతోచలేదు. కుటుంబ సభ్యురాలికి ఆప్యాయంగా పలుకరిస్తూ మనోధైర్యాన్ని నింపడమే కాకుండా నిత్యావసర సరుకులు, పింఛన్ అందజేసి ఆదుకుంది. వలంటీర్ వ్యవస్థ లేకపోతే కాలు కదపలేని పరిస్థితులో ఉన్న నాలాంటివరి పరిస్థితి తలుచుకుంటేనే భయం వేస్తోంది.

– వెంకటమ్మ బుగ్గానిపల్లె గ్రామం, బేతంచెర్ల మండలం

ఆపత్కాలంలో అండగా నిలిచి..



కోవిడ్ సమయంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.వెయ్యి అందిస్తున్న వలంటీర్ మమత(ఫైల్)

కోవిడ్ కారణంగా ప్రభుత్వాలు 2020–2021లో లాక్‌డౌన్ విధించాయి. ఎవ్వరూ బయటకు రాలేని పరిస్థితులు. కష్టకాలంలో వలంటీర్లు ప్రజలకు అండగా నిలిచారు. కోవిడ్ నిబంధనలు కఠినంగా ఉన్నా జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. వెయ్యి ఆర్థిక సాయంతోపాటు దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులు, మాస్కులు అందజేస్తూ మనోధైర్యానిచ్చారు వలంటీర్లు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్న వారి వద్దకు వెళ్లి పింఛన్‌లను అందించారు. ఆపత్కాల సమయంలో వలంటీర్లు చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. – అవుకు

సొంత చెల్లిలా ఆదుకుంది



వలంటీర్ల సేవలు అందరికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు ఎవ్వరూ మరువరు. బయటకు రాలేని పరిస్థితుల్లో జీవనం ఎలా అనే అయోమయంలో వలంటీర్లు అండగా నిలిచారు. మా కాలనీకి సంబంధించి వలంటీర్ కునిగారి మమత ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం మంజూరు చేసిన నగదుతోపాటు నిత్యావసర సరుకులు అందజేసి ఆదుకుంది. వారు లేకుంటే పలుకరించే నాథుడే లేడు. ఎవరేమనుకున్నా కరోనా కష్టకాలంలో వలంటీర్ల సేవలు అద్భుతం. – జమ్ముగారి భవానీ, అవుకు.

కుందూనది పరిరక్షణలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

కోవెలకుంట్ల: కుందూనది పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక తీర్మానం చేసింది. ఆదివారం స్థానిక శివాలయం ఆధ్యాత్మిక కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్‌సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు పేరా శ్రీధర్‌రెడ్డి, కుందూ పోరాట సమితి కన్వీనర్ కామని వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మానవహక్కుల సంఘం నాయకుడు కరీంబాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్, రాయలసీమ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు ఓబులేసు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుందూనది ద్వారా వందలాది గ్రామాల ప్రజలకు సాగు, తాగు నీరు అందుతోందన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి వ్యర్థాలను వదులుతున్నందున నీరు కలుషితమవుతోందన్నారు. దీంతో నదిలోని చేపలు మృత్యువాత పడుతున్నాయని, నీరు కలుషితమై వినియోగించుకునేందుకు వీలు లేకుండా పోతోందన్నారు. జీవనదిగా ఉన్న కుందూ కలుషితం కాకుండా భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సుబ్బరాయుడు, ప్రసాదు, రామలింగారెడ్డి, సురేష్, గురప్ప, వెంకటసుబ్బయ్య, గడ్డం అమర్‌నాథరెడ్డి, నవీన్, రఘు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మరమ్మతు పనులు

కొలిమిగుండ్ల: జాతీయ రహదారిపై(544–డీ) మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అంకిరెడ్డిపల్లె సమీపంలోని జిల్లా సరిహద్దు నుంచి రాఘవరాజుపల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, కొలిమిగుండ్ల, బెలుం శివార్ల వరకు జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈరహదారిపై వందల సంఖ్యలో వాహనాల రాక పోకలు జరుగుతుంటాయి. గుంతలు ఏర్పడతంతో రోడ్డు వాహన చోదకులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు చాలా ఇబ్బంది పడేవాళ్లు, ఎట్టకేలకు జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలకు మోక్షం లభించింది. గుంతలను పూడ్చి తారుతో ప్యాచింగ్ పనులు చేపట్టడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

డోన్ టౌన్ : ఇంటర్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయించి విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ అడ్మిషన్లను రద్దు చేస్తూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం మండల స్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా మహేష్, ఉపాధ్యక్షులుగా మధు, కృష్ణ, సురేష్, సునీల్, సహాయ కార్యదర్శులుగా జగన్, మహేంద్ర, శ్రీనివాసులు, చరణ్ ఎంపికయ్యారు. సమావేశంలో నాయకులు ఇర్ఫాన్ బేగం, విజయ్, మహేష్, సోమునాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, శివకాంత్, గిడ్డయ్య, మల్లికార్జున, ఆనంద్ పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ భవనం ముస్తాబు

- రేపు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని



రూ.18 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ భవనం

సంజామల: మండల కేంద్రం సంజామలలో నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. అత్యాధునికి వసుతులో లైబ్రరీని నిర్మించారు. రూ. 18 లక్షలతో నిర్మించిన లైబ్రరీతో పాటు రూ. లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లును మంగళవారం ఎంమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కర్నూలు కేడీసీసీ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

నేటి నుంచి గడపగడపకు మనప్రభుత్వం

మండల కేంద్రం సంజామలలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కర్నూలు కేడీసీసీ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతున్నారు. గడప గడపను ఎమ్మెల్యే సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న గుండం శేషిరెడ్డి, గుండం నాగేశ్వరరెడ్డి

బనగానపల్లె: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వైద్యశాల, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రాంగణంలో ఆదివారం సిబ్బందితో కలిసి వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఓ మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ హరిరెడ్డి, శాంతిప్రియ, బ్రాంచ్ మేనేజర్ శివరామకృష్ణ, క్లస్టర్ మేనేజర్ శివప్రకాష్, ఆర్ఎం శరత్‌కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ శివకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శివుడికి అభిషేకం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో వెలసిన శ్రీ రామేశ్వర స్వామివారికి ఆలయ అర్చకులు భాస్కరయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల వివాహమైన మహిళలు ఆషాఢ మాసం పూజలు నిర్వహించారు. శివుడికి రుద్రభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదం స్వీకరించారు.

వర్షం కోసం వరుణ యాగం

డోన్ టౌన్ : పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని శ్రీసాంబశివాలయంలో సస్యనుకూల వర్షం కురిసి దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ అర్చకులు కొల్లి శేషావలిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం డోన్ పురోహితులు వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కళశంలో శివుడికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పురోహిత సంఘం సభ్యులు సుబ్రహ్మణ్యం శర్మ, శ్రీనివాసశర్మ, భాస్కర్‌శర్మ పాల్గొన్నారు.

మూలమ్మకు బోనాల సమర్పణ

అవుకు: అవుకు సమీపాన కాశీవిశ్వనాథ దేవాలయం దగ్గర వెలసిన మూలమ్మ తల్లికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయ పూజారి నరసింహులు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామికి మాసశివరాత్రి సందర్భంగా స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి,అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ ఉమా మహేశ్వరస్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు.

ఆంధ్ర,కర్ణాటక ఇన్నర్ వీల్ క్లబ్ చైర్మన్‌గా సుమిత్ర రాజేష్



సుమిత్ర రాజేష్‌ను అభినందిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ జాతీయ అధ్యక్షురాలు ప్రీతి

డోన్ టౌన్ : ఆంధ్ర, కర్ణాటక ఇన్నర్‌వీల్ క్లబ్ 361 డిస్ట్రిక్ చైర్మన్‌గా డోన్ పట్టణానికి చెందిన సుమిత్ర రాజేష్‌ను సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు ఇన్నర్‌వీల్ క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రీతి గగ్‌నాని, వెస్ట్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్ వాణి మూర్తి తదితరులు హాజరై సుమిత్ర రాజేష్‌ను అభినందించారు. డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సతీమణి సుమిత్ర రాజేష్.

కర్ణాటక టెట్రా ప్యాకెట్ల స్వాధీనం

డోన్ టౌన్ : మండల పరిధిలోని కమలాపురంలో మద్యం విక్రయిస్తున్న చాకలి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వెంకటేశ్వర్లు ఇంటిని సోదా చేసి కర్ణాటకకు చెందిన 73టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి జడ్జి ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఐని కలిసిన ఆటో యూనియన్ నాయకులు

డోన్ టౌన్ : పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను ఆదివారం ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అన్వర్, వెంకటేష్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐని పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదుర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదుర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

మద్యానికి బానిసలు కాకూడదు



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్ : మద్యానికి ఎవ్వరూ బానిసలు కాకూడదని, అప్పుడే ఆ కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందుతుందని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. వడ్డేర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన సాధారణ సమావేశానికి హాజరై మాట్లాడారు. శారీరక శ్రమ ఎక్కువగా ఉన్న వడ్డెరులు అలసట పేరుతో మద్యానికి బానిసలవుతున్నారని, ఈ చర్యను వీడాలన్నారు. అలసట పేరిట ప్రారంభమై చివరకు వ్యవసనపరులు అవుతున్నారని, ఇప్పటికైనా వాటికి స్వస్తి చెప్పాలని సూచించారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఒకే వేదికపై చేరిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక వీరభద్ర పంక్షన్‌హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1991–92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న వంద మంది విద్యార్థులు అమెరికా, హైదరాబాదు, బెంగుళూరు, కర్నూలు, నంద్యాల, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. వీరంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ద్వారా ఒక వేదికపై చేరారు. పాత జ్ఞాపకాలు, అనుభూతులు గుర్తు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మస్తాన్, కిషోర్, సునీల్, చాంద్, చంద్రశేఖర్, ఖాజా, రఘు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



పూర్తయిన గృహాన్ని పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి

సంజామల: గృహ నిర్మాణాలు త్వరగ పూర్తి చేయాలి, ఆ దిశగా లబ్ధిదారులను చైతన్య పరచాలని హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మండల కేంద్రం సంజామలలో ప్రధాన మంత్రి అవాస్ యోజన, 'కుడ' పథకం కింద మంజూరైన గృహాలను ఏఈ బాల చంద్రుడితో కలిసి పరిశీలించారు. అదేవిధంగా జగనన్న కాలనీ లేఅవుట్లను సందర్శించారు. గృహ నిర్మాణాల తీరుపై ఏఈని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని లబ్ధిదారులకు వివరించి త్వరగా గృహనిర్మాణాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభించని లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం, ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరువుతున్న తీరను వివరించి అవగాహన కల్పించాలని తెలిపారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్ కాలపరిమితి పెంచాలి

కోవెలకుంట్ల: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్ కాలపరిమితి పెంచాలని ఆ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా కళాశాలల్లో 3,618 మంది ఒప్పంద అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒప్పంద అధ్యాపకులు 11 నెలలు మాత్రమే పనిచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వేకెషన్ కాలంలో కూడా అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. సప్లమెంటరీ విద్యార్థుల ఉత్తీర్ణత, రెమిడియల్ క్లాసులు, డ్రాప్‌అవుట్‌ను కళాశాలల్లో తిరిగి చేర్పించడం, తదితర ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. వీటని దృష్టిలో ఉంచుకుని 12 నెలలకు రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.